


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :133 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ ఆదివారం- 06 - సెప్టెంబర్ - 2026

## జెలెన్స్కీ కాల్పుల విరమణ ప్రతిపాదన..
## కీవ్‌పై 3 రోజులు దాడులు చేయబోమన్న పుతిన్..

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మరోసారి దౌత్య ప్రయత్నాలు జోరందుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది.
- ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు.



ఢిల్లీ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మరోసారి దౌత్య ప్రయత్నాలు జోరందుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్.. రష్యా, ఉక్రెయిన్ పర్యటనలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది రష్యా-ఉక్రెయిన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ శుక్రవారం ప్రతిపాదన చేశారు. అమెరికా ప్రతినిధులు రష్యా, ఉక్రెయిన్‌లలో చర్చలు జరిపే సమయంలో ఉక్రెయిన్ వైపు నుంచి వైమానిక దాడులు ఉండవని జెలెన్స్కీ చెప్పారు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు



- ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్
- ఉపాధ్యాయులు అరాకలితో అలమటిస్తున్నారని ఆవేదన
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ఢిల్లీ : ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని మిగతా..2లో

## విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో
# అప్రమత్తంగా ఉండాలి'

- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు



ఢిల్లీ : విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, అధిక స్క్రీన్ టైమ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పిల్లలను కేవలం చదువులోనే కాకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, ఆసక్తులు, అలవాట్ల పరంగా కూడా గమనించాలని చెప్పారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తు, విద్యా విధానం, డ్రగ్స్, స్క్రీన్ టైమ్ వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. మిగతా..2లో

## కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

హైదరాబాద్ : కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
# రూ.70 వేల కోట్ల పెట్టుబడి!

- హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుచేయనున్న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ 7 వేల మందికి ఉపాధి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- టీసీఎస్ హైపర్‌వాల్ట్ ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు. రూ.70వేల కోట్ల పెట్టుబడి! : హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. మిగతా..2లో

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి
# రాజీనామా చేయాలి



- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ



- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు
- శుక్రవారం రోజు హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు
- క్యూలైన్లలో భక్తులకు ఆహారం, తాగునీరు అందిస్తున్న టీటీడీ

అమరావతి: వారాంతం కావడంతో తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిశాయి. దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం యాత్రికులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై తీవ్ర రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా..2లో

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?
# రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ
- ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. మిగతా..2లో

## కర్నూలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన



- ఏపీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కర్నూలు జిల్లాలో రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

కర్నూలు, సెప్టెంబరు 5: జిల్లాలోని మార్కెట్ యార్డులో రూ. 50 లక్షల వ్యయంతో చేపడుతున్న షెడ్ నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. వీటితో పాటు జిల్లాలో మొత్తం రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం జిల్లా మార్కెట్ యార్డులో నూతన షెడ్ నిర్మాణాన్ని చేపట్టినట్టు మంత్రి తెలిపారు. దీంతో పాటు రానున్న రోజుల్లో

## 12వ పీఆర్‌సీ ఏర్పాటుకు
# సీఎం చంద్రబాబు అంగీకారం

### సంబరాల్లో ఉద్యోగ సంఘాలు

- సీఎం చంద్రబాబుతో సానుకూలంగా ముగిసిన ఉద్యోగ సంఘాల చర్చలు
- అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం
- సరెండర్ లీవులు జనవరిలో ఇవ్వాలని నిర్ణయం
- ఉద్యోగ సంఘం నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించారు. ఆర్థికంగా ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు డీఏలను మిగతా..2లో

## రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు అయ్యన్న ప్రకటన



- ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి
- ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ

కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కాలినడక మార్గాలు, బయట రింగు రోడ్డు వరకు ఉన్న క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం పాలు, తాగునీరు, అల్పాహారం అందజేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక శుక్రవారం ఒక్కరోజే 68,374 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,241 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ ప్రయాణాన్ని, దర్శనాన్ని తగిన జాగ్రత్తలతో ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కర్నూలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన

యార్డులో 30 నుంచి 40 వరకు కొత్త షాపులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. రైతుల కృషి వల్లే ఈ ఏడాది మార్కెట్ యార్డు ఆదాయం రూ. 8 కోట్లకు పెరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో ఉల్లిధరలు పడిపోయిన సమయంలో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి రైతులకు అండగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి భరత్ అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

### మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి..

వినాయక చవితి నేపథ్యంలో ప్రజలు ప్రకృతిని, పర్యావరణాన్ని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి భరత్ కోరారు. కేసీ కెనాల్, సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంగా పెద్ద విగ్రహాలు పెడితే నిమజ్జనం చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని చిన్నచిన్న వినాయక విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా పర్యావరణానికి హాని చేకూరని విధంగా మట్టివిగ్రహాలను పూజించాలని మంత్రి సూచించారు.

## రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు? రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## జెలెన్‌స్కీ కాల్పుల విరమణ ప్రతిపాదన.. కీవ్‌పై 3 రోజులు దాడులు చేయబోమన్న పుతిన్..

అదే సమయంలో రష్యా కూడా దాడులను నిలిపివేయాలని కోరారు. ఇరు దేశాలు కనీసం చర్చలు జరిగేంత సమయం పాటు దాడులు ఆపితే.. శాంతి చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు జెలెన్‌స్కీ ప్రతిపాదన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేయాలని ఆదేశించినట్లు క్రెమ్లిన్ ప్రకటించింది. ఈ తాత్కాలిక విరామం శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమవుతుందని రష్యా తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా మరోసారి చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ మాస్కోకు వెళ్లారు. అక్కడ రష్యా అధికారులతో చర్చించిన అనంతరం కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం కానున్నారు యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా వద్ద ఒక కొత్త శాంతి ప్రతిపాదన ఉందని ట్రంప్ ఇప్పటికే వెల్లడించారు . ఇటీవల పుతిన్ కూడా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతి ఒప్పందానికి అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా, చైనా సహా పలు దేశాలు శాంతి పరిష్కారానికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అయితే చివరకు సమస్యను పరిష్కరించాల్సింది మాత్రం రష్యా, ఉక్రెయిన్‌లేనని స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు

కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది'

**మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైందని నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యమని కామెంట్స్- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు**

ఢిల్లీ : ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రస్తుతం విశ్వసనీయత సంక్షోభం మీడియా రంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లోనూ క్రెడిబిలిటీ తగ్గుతున్నప్పటికీ, మీడియా రంగంలోనే ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఐఐఎం నాగ్‌పూర్ మీడియా కాన్‌క్లేవ్ 2026లో 'మీడియా, లీడర్‌షిప్ అండ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ ఏకే భట్టాచార్య, బ్లిట్జ్ ఇండియా మీడియా గ్రూప్ ఛైర్మన్, ఎడిటర్ ఇన్ చీఫ్ దీపక్ ద్వివేది తదితరులు హాజరయ్యారు.

### ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం

భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని గడ్కరీ అన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి మార్పు రావాలంటే దాని కీలక వ్యవస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా తమ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి. ప్రజాస్వామ్యం పురోగతికి, అభివృద్ధికి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయవ్యవస్థతో పాటు స్వతంత్ర మీడియా కూడా అవసరమని అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ - రూ.70 వేల కోట్లు పెట్టుబడి!

మొదటి పేజి తరువాయి

హైపర్ వాల్ట్ తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు : తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని పేర్కొన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా : ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు



రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా..



ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

### ఇప్పట్లో విస్తరణ లేనట్లే!

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## 12వ పీఆర్‌సీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం - సంబరాల్లో ఉద్యోగ సంఘాలు

మొదటి పేజి తరువాయి

అక్టోబర్ 1 నుంచి చెల్లించడంతో పాటు పీఆర్ సీ ఛైర్మన్ నియామకానికి సీఎం అంగీకరించారు. ఒక సరెండర్ లీవ్, పోలీసులకు అదనంగా మరో సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపునకు సరేనన్నారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్, ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలియజేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గుర్తింపు పొందిన 11 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని భేటీలో ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం వివరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్న సీఎం గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్న నేపథ్యంలో ఉద్యోగులు సంయమనం పాటించాలని చంద్రబాబు కోరారు. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ధి కలిగిందన్న ఉద్యోగ సంఘాల నేతలు సాధారణ ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. డిమాండ్లు - సానుకూల స్పందన: దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 12వ పీసీఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఛైర్మన్‌ను త్వరలో నియమిస్తామని తెలిపారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ లను అక్టోబర్ 1, 2026 నుంచి చెల్లించేందుకు అంగీకరించారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదును వచ్చే సంక్రాంతికి చెల్లించడంతోపాటు పోలీసు సిబ్బందికి అదనంగా మరో సరెండర్ లీవ్‌ను అక్టోబర్ నుంచి చెల్లించేందుకు ముఖ్యమంత్రి సరేనన్నారు. అయితే పీసీఆర్ ఏర్పాటు చేసేలోగా ఐఆర్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా కచ్చితంగా ఇస్తామని, అందుకు కొంత సమయం కావాలని చంద్రబాబు కోరారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 2027 జనవరి నుంచి అమలు చేస్తారు. ఆరోగ్య పథకంలో ఉద్యోగులు కోరిన మార్పును సీఎం అంగీకరించారు. 'సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగింది. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక సరెండర్ లీవ్ (పోలీసులకు అదనంగా మరొకటి), రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని మేం కోరాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారు. ' -సూర్యనారాయణ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీపీఎస్ కు శాశ్వత పరిష్కారం: ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. ఈ అంశాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపైనా చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు సీపీఎస్ కు ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం



కల్పించాలని కోరారు.ప్రభుత్వ నిర్ణయాలపై ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చిస్తామని బొప్పరాజు తెలిపారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల బదిలీకి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సమావేశంలో సీఎం చెప్పారని ఏపీటీఎఫ్ నేతలు తెలిపారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ విషయంలోనూ సానుకూల నిర్ణయం ఉంటుందని చెప్పారని వెల్లడించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచేందుకు ఉన్న వెసులుబాటుపై ఆలోచించాలని సీఎస్‌ను చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. వివాదం: సీఎంతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడే క్రమంలో ఉద్యోగ సంఘాల నేతల మధ్య పోటీ నెలకొనడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి పరస్పరం తోపులాట వరకు వెళ్లింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు కూడా సమన్వయం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.

## విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'

మొదటి పేజి తరువాయి

"ఉపాధ్యాయులు పుస్తకాలు, సిలబస్‌కే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి. పిల్లల్లో సహజంగా ఉండే ఆసక్తి, తెలుసుకోవాలనే కుతూహలాన్ని గుర్తించి దాన్ని సరైన దిశలో మళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. పిల్లల బాల్యాన్ని కోల్పోకుండా చూడటం ఉపాధ్యాయులు చేయగలిగే అతిపెద్ద సేవ. తరగతి గదిలో పాఠాలను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలి. విద్యార్థుల అకడమిక్ పనితీరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయా? వారి రోజువారీ జీవితం ఎలా ఉంది? అనే విషయాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలపై తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబసభ్యుల పర్యవేక్షణ కూడా ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగింది."

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

### డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల సమస్యను గుర్తించడం కష్టంగా మారుతోందని మోదీ అన్నారు. ఎవరు ఎవరికి ఏం ఇస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిశితంగా పరిశీలించాలని చెప్పారు.

### 'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'

విద్యార్థుల్లో అధిక స్క్రీన్ టైమ్ మరో ప్రధాన సమస్యగా మారిందని



ప్రధాని పేర్కొన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్లను చూస్తున్నారు? రాత్రివేళల్లోనూ ఫోన్లు ఉపయోగిస్తున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లల్లో క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా సహజంగానే మొబైల్ వినియోగాన్ని తగ్గించవచ్చని మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ)ను ప్రస్తావించిన ప్రధాని పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదని అన్నారు. నిజ జీవిత నైపుణ్యాలు, వివిధ రకాల పనులు, సమాజంతో వారికి పరిచయం కల్పించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాల్లోని విషయాలకు పరిమితం కాకుండా జీవితాన్ని అర్థం చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

### మహిళల్లో క్యాన్సర్ అవగాహనపై ప్రశంస

తన పరిసర ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ప్రయత్నాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్ కోసం ముందుకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా నమోదైనట్లు మోదీ తెలిపారు.

### 82 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు

ఈ ఏడాది జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఎంపికయ్యారు. ఇందులో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్ ల నుంచి 21 మంది, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది స్కిల్ ట్రైనర్లు ఉన్నారు.

# ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## ఉపాధ్యాయులకు వైద్య చికిత్సలో రాయితీ ఇవ్వడానికి ముందుకు వచ్చిన మెడిలైఫ్ హాస్పిటల్ యాజమాన్యం



నస్పూర్, : మంచిర్యాల జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారం జరిగిన వేడుకలలో 70 మంది టీచర్స్ ను ఘనంగా సన్మానించారు. నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ దర్ని మధుకర్, మండల విద్యాశాఖ అధికారి చౌదరి, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మెడ్ లైఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, 27వ డివిజన్ కార్పొరేటర్ కొండ్ర రాజేశ్వరి లింగయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ దర్ని మధుకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో ఎంతో విలువ ఉన్నదని, ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యను అందించడమే, కాకుండా కుటుంబ పరిస్థితులను, సమాజాన్ని మార్చే శక్తి, దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి ఒక ఉపాధ్యాయునికి ఉందన్నారు. ఉపాధ్యాయులకు మెడి లైఫ్ హాస్పిటల్ లో వైద్య చికిత్సలో రాయితీ కల్పించినందుకు మెడి లైఫ్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఒక డాక్టర్, ఇంజనీర్, రాజకీయవేత్త, అధికారి ఎవరిని అయినా తయారు చేసేది ఉపాధ్యాయుడని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ట్ర స్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్నామని, ఉపాధ్యాయుడు తను కొవ్వొత్తిలా కరిగిపోతూ సమాజానికి వెలుగును ఇస్తూ నవ సమాజాన్ని నిర్మిస్తున్నారన్నారు. ట్రస్మా ఉపాధ్యాయుల యొక్క సంక్షేమాన్ని కోరుకుంటుందని, దానిలో భాగంగా మెడిలైఫ్ హాస్పిటల్ మంచిర్యాల్ వారి అనుసంధానంతో వైద్య చికిత్సలో రాయితీ కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి ముందుకు వచ్చిన మెడిలైఫ్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న, కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, ట్రెజరర్ కృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, ట్రస్మా నస్పూర్ మండల అధ్యక్షుడు మైదం రామకృష్ణ, కార్యదర్శి ఉట్ల సత్యనారాయణ, కోశాధికారి అంబాల రాజకుమార్, ఉపాధ్యక్షుడు అమన్ ప్రసాద్, మంచిర్యాల మండల అధ్యక్షుడు, జైపూర్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, జుల్ఫికర్, కరస్పాండెంట్లు రమేష్, ప్రణయ్, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి సాంఘిక సంక్షేమ గురుకులంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.

## ప్రిన్సిపాల్ ప్రేమరాణికి పేరెంట్స్ కమిటీ ఘన సన్మానం



మందమర్రి,: మందమర్రి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమరాణిని పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేరెంట్స్ కమిటీ సభ్యులందరికీ గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు) అందజేశారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కొండ సతీష్, వైస్ ప్రెసిడెంట్ రఘు, ట్రెజరర్ శ్రీనివాస్, అడ్వైజర్ నరేష్, కమిటీ సభ్యులు రాజ్ కుమార్, శ్యామ్ మరియు జిల్లా పేరెంట్స్ కమిటీ సభ్యులు చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గురుపూజోత్సవం ఘనంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి పునాది : ఎర్రబెల్లి స్వర్ణ





ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోచమ్మ మైదాన్ 22వ డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురిని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో విద్యను కొనసాగిస్తున్న పేద విద్యార్థులకు విద్యాభ్యాసానికి తోడ్పడేలా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని అన్నారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను విద్యార్థుల్లో పెంపొందిస్తూ భావి తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలతో సమాజంలో స్ఫూర్తి నింపుతున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వరంగల్ ప్రతినిధులు, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సన్మాన గ్రహీతలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## జిల్లాకే ఆదర్శంగా ఎంపీపీఎస్ ఉపాధ్యాయుల సేవలు



మందమర్రి,: వినూత్న ఆలోచనలు, నూతన బోధనా పద్ధతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మందమర్రి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ఉపాధ్యాయులు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తున్నారని మంచిర్యాల హైటెక్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజు పటేల్ కొనియాడారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మంచిర్యాల హైటెక్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయురాలు జనగామ ఉమాదేవి, ఉపాధ్యాయులు గుడి వెనుక రవి, చింతకింది లలిత, పొన్నాల మంజుల, భీమపుత్ర శ్రీనివాస్‌లకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ.. ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న ఆలోచనలతో విద్యాబోధన చేస్తూ జిల్లా స్థాయిలో పలువురి ప్రశంసలు అందుకుంటున్నారని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి, వారి ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించడం పాఠశాల ఉపాధ్యాయుల సృజనాత్మక ఆలోచనలకు నిదర్శనమన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుడు భీమపుత్ర శ్రీనివాస్ మానవ శరీర అవయవాల పనితీరును విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్న రీతిలో బోధించిన తీరు ప్రత్యేకంగా నిలిచిందన్నారు. మానవ శరీర భాగాలను ప్రతిబింబించే దుస్తులు ధరించి విద్యార్థులకు ప్రత్యక్షంగా అవయవాల పనితీరును వివరించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారని తెలిపారు. ఈ వినూత్న బోధనా విధానం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మీడియా దృష్టిని ఆకర్షించి మందమర్రి పేరును మార్మోగేలా చేసిందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాథమిక పాఠశాలలో 176 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండటం ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న నమ్మకానికి, ఉపాధ్యాయుల కృషి, నిబద్ధతకు నిదర్శనమని రాజు పటేల్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అనంతరం సన్మానం పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి మంచిర్యాల హైటెక్ సిటీ లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి ప్రోత్సాహం మరింత బాధ్యతతో పనిచేసేందుకు ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ సీహెచ్ రామయ్య, ప్రోగ్రాం చైర్‌పర్సన్ ఇడిదినేని తిరుపతి, క్యాబినెట్ సభ్యులు హనుమంతరావు, పోచమల్ల తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కోరల్లో ఆసిఫాబాద్ జిల్లా

## అప్రమత్తం కాకపోతే యువత భవితవ్యం ఆగమే!

## నిన్న రెబ్బన.. నేడు తిర్యాణి, సిర్పూర్ (యు).. రేపెక్కడ?

## రోజుకో ప్రాంతంలో వెలుగుచూస్తున్న మత్తు దందాపై ప్రజల ఆగ్రహం

## 460 గంజాయి మొక్కల స్వాధీనం, నలుగురు అరెస్ట్..




ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయి మహమ్మారి రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. పచ్చని పల్లెలు, ఏజెన్సీ అడవుల మాటున అక్రమార్కులు మత్తు విషాన్ని విస్తరిస్తున్నారు. నిన్న రెబ్బన మండలంలో దందా గుట్టురట్టయితే.. అంతకుముందు మరో ప్రాంతంలో అక్రమ రవాణా బయటపడింది. తాజాగా సిర్పూర్ (యు) మండలం బూర్నూర్, జెల్గాట్, గుట్టగూడ శివార్లలోని వ్యవసాయ భూముల్లో ఏకంగా 460 గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకోవడం జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

### రోజుకొక చోట పెట్రేగుతున్న ముఠాలు..

### నాశనమవుతున్న యువత

జిల్లా వ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి బ్యాచ్‌లు గ్రామాల్లోని యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో పంట చేలలో గంజాయి సాగు చేస్తూ, ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేస్తూ యువతను బానిసలుగా మారుస్తున్నారు. ఈ మత్తు ఊబిలో చిక్కుకున్న యువకులు మానసికంగా, శారీరకంగా దెబ్బతిని భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుని కుటుంబానికి అండగా ఉండాల్సిన వయసులో గంజాయికి బానిసై కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. దీన్ని ప్రాథమిక దశలోనే నిర్మూలించకపోతే జిల్లాలోని యువతరం పూర్తిగా ఆగం కావడం ఖాయమనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

### పోలీసులతో పాటు ప్రజలూ కదలాలి..

### గంజాయి బ్యాచ్‌లను తరిమికొట్టాలి

గంజాయి సాగు, నిల్వ, అమ్మకాలపై జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాలతో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ వరుస దాడులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ మహమ్మారిని పూర్తిగా అంతం చేయాలంటే కేవలం పోలీస్ యంత్రాంగం పైనే భారం వేయకుండా ప్రజలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయులు సైతం భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. గ్రామాల్లో కొత్త వ్యక్తుల కదలికలు కనిపించినా, పంట చేలల్లో అనుమానాస్పద సాగు జరుగుతున్నా గ్రామస్థులు వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలి. ప్రతి గ్రామం నుంచి గంజాయి ముఠాలను తరిమికొట్టేందుకు సమాజం ఏకం కావాలి.

### గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం కావాలి

ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాచారం అందిస్తేనే ఈ అక్రమ నెట్‌వర్క్ వేర్లతో సహా తెగిపోతుందని స్థానికులు భావిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాను 'గంజాయి రహిత జిల్లా'గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా గ్రామ గ్రామానా ప్రజలు చైతన్యవంతమై పోలీసులకు అండగా నిలవాలని, భావి తరాల బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని జిల్లా ప్రజలు బలంగా ఆకాంక్షిస్తున్నారు..

# ఇంటి పెరట్లో గంజాయి సాగు

## నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు




తిర్యాని, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలో ఇంటి పెరట్లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని చిన్న అరటిపల్లికి చెందిన మేచినేని చిన్నయ్య తన ఇంటి వెనుక గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం (సెప్టెంబర్ 3న) ఆకస్మిక సోదాలు నిర్వహించారు. పెరట్లో సాగు చేస్తున్న సుమారు రూ.70 వేల విలువైన గంజాయి మొక్కలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో పంచనామా పూర్తి చేసి కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు చిన్నయ్యను శనివారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ సంజయ్ మాట్లాడుతూ, గంజాయి సాగు మరియు విక్రయాలు చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించారు. మండలంలో మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా గంజాయి సాగు లేదా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,: రాష్ట్రంలోని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో విద్యా పరిపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రతిష్ఠాత్మక ప్రతిభా పురస్కారం2026 ను అందుకున్నారు. 202627 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 202526లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 202627లో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగి 2 వేల 554 మంది అదనంగా చేరారు. 202425తో పోలిస్తే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాలలో 10 శాతానికి పైగా నమోదు పెరిగింది. అలాగే 202627లో 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎం ఐ ఎస్, సి సి ఓ లు, సి ఆర్ పి ల సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టితో జిల్లాలో విద్యాభివృద్ధి సాధ్యపడింది. మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించింది.

# భీమారం లో ఉచిత మెగా వైద్య శిబిరం.



భీమారం, : భీమారం మండల కేంద్రంలోని మాన్విక్ ఫార్మసీ ఆధ్వర్యంలో, సన్రైజ్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్ లో 200 మందికి పైగా ఉచిత గుండె, షుగరు పరీక్షలు నిర్వహించి ,మందులు పంపిణీ చేయడం జరిగింది... సన్రైస్ హాస్పిటల్ డాక్టర్లు మాట్లాడుతూ, సన్రైస్ హాస్పిటల్ లో 150 బెడ్లు, 25 మంది ఫుల్ టైం డాక్టర్లు కలిగి ఉండి ,ఆరోగ్య శ్రీ ,పవర్ డిపార్ట్మెంట్, బి ఎస్ ఎన్ ఎల్, ఎఫ్ సి ఐ, సింగరేణి ,40 రకాల ఇన్సూరెన్స్ ల ద్వారా నగదు రహిత వైద్య సదుపాయం అందుబాటులో ఉందని మండల ప్రజలు సన్రైస్ హాస్పిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పషేంట్స్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మాన్విక్ క్లినిక్ డాక్టర్ రంజిత్ కుమార్ ( ఫార్మా . డి ), సన్రైస్ హాస్పిటల్స్ డాక్టర్ రమణి , డాక్టర్ భిక్షపతి , మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొప్పుల ప్రశాంత్ ,గోగు శ్రీనివాస్ ,క్యాంప్ కో ఆర్డినేటర్ సతీష్ ,హాస్పిటల్ నర్సింగ్ స్టాఫ్ ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అవసరంలో ఉన్న వారికి అండగా ఆలయ ఫౌండేషన్

## జైరాంకు వీల్‌చైర్ అందజేత



మంచిర్యాల,: అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పి. నరహరి, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా బి-జోన్, అశోక్‌నగర్‌కు చెందిన జైరాంకు వీల్‌చైర్‌ను అందజేశారు. ఆలయ ఫౌండేషన్ తరఫున వీల్‌చైర్‌ను అందజేయడం ద్వారా జైరాంకు రోజువారీ అవసరాల్లో కొంతమేర సౌలభ్యం కల్పించారు. అవసరాల్లో ఉన్న వారికి సహాయం అందించడమే లక్ష్యంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈఓ తీట్ల రమేష్, డిప్యూటీ సీఈఓ కీర్తి నాగార్జున, కన్నం తిరుపతి, జీవన్, మహేష్, కార్తిక్ పాల్గొన్నారు. సేవే పరమ ధర్మం అనే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# ఉమ్మడి మంగి గ్రామ పంచాయతీల్లో సార్ నోటీసుల డేటా వెరిఫికేషన్



తిర్యాణి, : మండలంలోని ఉమ్మడి మంగి గ్రామ పంచాయతీ పరిధిలో తాసిల్దార్ కార్యాలయం నుంచి సార్ నోటీసులు అందుకున్న వారి వివరాలపై డేటా వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. మంగి గ్రామ పంచాయతీ కేంద్రంగా మంగి, కౌటగూడ, ముల్కలమంద పంచాయతీల ప్రజల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో సమగ్రంగా పరిశీలించారు. గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించి, వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపోల్చారు. పేర్లు, వివరాల్లో దొర్లిన తప్పులను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా వివరాలు నమోదు చేయడమే ఈ పరిశీలన ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ పరిశీలన ప్రక్రియను తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట్నాక గణపతి సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాయిసిడం వినోద్ (మంగి), కుద్మెత హనుమంతరావు (ముల్కలమంద), కథలే మంజుల మధుకర్ (కౌటగూడ), మంగి ఉప సర్పంచ్ కనక శ్రీకాంత్‌తో పాటు కౌటగూడ, ముల్కలమంద ఉప సర్పంచ్‌లు, రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఓ లు, బిఎల్ఏ లు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత్ పాకిస్థాన్ మ్యాచ్
# లైవ్ ఎక్కడ చూడాలో తెలుసా?

మహిళల ఆసియా కప్ 2026 : టోర్నీలో హై వోల్టేజ్ మ్యాచ్ కు అంతా సిద్ధం- అరుదైన రికార్డు కొట్టనున్న భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్




ఢిల్లి : 2026 ఆసియా కప్ లో భారత మహిళల జట్టు అసలైన మ్యాచ్ కు రెడీ అయ్యింది. ఇప్పటికే రెండు వరుస విజయాలతో సెమీఫైనల్ కు చేరిన టీమ్ఇండియాకు ఇది నామమాత్రపు మ్యాచే. కానీ, ప్రత్యర్థి పాకిస్థాన్ అవ్వడంతో మ్యాచ్ పై సర్వత్రా ఉత్కంఠ. గత మ్యాచ్ ల ఫామ్ ను కొనసాగిస్తూ హర్మన్ సేన ఇందులోనూ రెచ్చిపోయి దాయాదిని మరోసారి చిత్తుగా ఓడించాలని టీమ్ఇండియా అభిమానులు భావిస్తున్నారు. మరి ఈ మ్యాచ్ గురించి మరిన్ని విషయాలపై ఓ లుక్కేద్దాం! పొరపాట్లు సరిచేసుకోవాలి! తొలి రెండు మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధించిన భారత్ జట్టులోనూ లోపాలు ఉన్నాయి. బ్యాటింగ్ లో ఒకరిద్దరు తప్పిదే మిగిలిన ప్లేయర్ల నుంచి సహకారం కరవైంది. ముఖ్యంగా భారీ అంచనాలు ఉన్న కెప్టెన్ హర్మన్ ప్రీత్, ప్రతీకా రావల్, రిచా ఘోష్ వరుసగా రెండు మ్యాచ్ ల్లోనూ విఫలమయ్యారు. వీళ్లు ముగ్గురు పెద్దగా చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. దీంతో సెమీస్ కు ముందు ఈ మ్యాచ్ తోనైనా ఫామ్ లోకి రావాల్సి ఉంది.

### ఓపెనర్లే బలం!

టీమ్ఇండియాకు ఓపెనర్లే బలం అనడంలో సందేహం లేదు. ఎందుకంటే, తొలి మ్యాచ్‌లో షఫాలీ వర్మ థాయ్ లాండ్ పై 64 పరుగులు చేసి రాణించింది. ఇక రెండో మ్యాచ్‌లో హాంగ్ కాంగ్ పై స్మృతి మంధాన ఏకంగా సెంచరీతో మెరిసింది. ఈ రెండు మ్యాచ్ ల్లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకుంది వీళ్లిద్దరే. దీంతో పాకిస్థాన్ పైనా మంచి ఆరంభం ఇస్తే, జట్టుకు భారీ స్కోర్ రావడం ఖాయం. తిరుగులేని బౌలింగ్ బౌలింగ్ లో భారత స్పిన్న్ త్రయం శ్రీ చరణి, దీప్తి శర్మ, ప్రేమ రావత్ అదరగొట్టేస్తున్నారు. ప్రత్యర్థి బ్యాటర్లకు పరుగులు ఇవ్వకుండా కట్టడిచేస్తూ, వికెట్లు తీయడంలో సఫలం అవుతున్నారు. ఈ త్రయాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్ ప్లేయర్లుకు సవాల్ అని చెప్పవచ్చు. ఇక పేసర్లు నందని శర్మ, క్రాంతి గౌడ్ కూడా నిలకడగా ఆడుతున్నారు రాణిస్తున్నారు. మరోసారి జట్టు సమష్టి ప్రదర్శన చేస్తే గ్రూప్ దశను ఓటమి లేకుండా ముగించడం భారత్ కు పెద్ద కష్టమేమీ కాదు.

### పాక్ కు ఛాన్సుందా?

ఈ టోర్నీలో ఇప్పటిదాకా పాక్ ఒకే మ్యాచ్ ఆడింది. థాయ్ లాండ్ తో ఆడిన ఆ జట్టు విజయం సాధించింది. ఇప్పుడు భారత్ ను ఢీ కొడుతోంది. ఇందులో నెగ్గి సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలని భావిస్తోంది. కానీ పాక్ కంటే అన్ని విధాలుగా బలంగా ఉన్న టీమ్ఇండియాను ఓడించడం వాళ్లకు పెద్ద సవాలే. అయినా కెప్టెన్ ఫాతిమా సనాపై పాక్ బోలెడు ఆశలు పెట్టుకుంది. ఆమె బంతితో, బ్యాటుతో సత్తా చాటగలదు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ మునీబా అలీ కూడా నాణ్యమైన బ్యాటరే. వీళ్లతోపాటు నష్రా సంధు, సాదియా ఇక్బాల్, హనితో బౌలింగ్ కూడా బలంగానే కనిపిస్తుంది. దీంతో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగడం పక్కా అనిపిస్తోంది. లైవ్ ఎక్కడంటే? ఈ టోర్నమెంట్ కు సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్ అధికారిక బ్రాడ్ కాస్టర్ గా వ్యవహరిస్తుంది. దీంతో ఈ హైవోల్టేజ్ మ్యాచ్ ను సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్ లో లైవ్ చూడవచ్చు. సోనీ స్పోర్ట్ టెన్ 1, సోనీ స్పోర్ట్ టెన్ 3, సోనీ స్పోర్ట్ టెన్ 4 బ్రాడ్ కాస్టింగ్ ఛానెళ్లలో లైవ్ అందుబాటులో ఉంటుంది. అలాగే సోనీ లివ్ యాప్ లేదా వెబ్ సైట్ లో లైవ్ స్ట్రీమింగ్ కూడా చూడవచ్చు.

### మ్యాచ్ డీటెయిల్స్

దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యం ఇవ్వనుంది. శనివారం రాత్రి 8 గంటలకు ఆట ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

### హర్మన్ రికార్డ్

హర్మన్‌ప్రీత్ టీ20ల్లో భారత్ కు కెప్టెన్ గా వ్యవహరిస్తున్న 150వ మ్యాచ్ ఇది. ఇప్పటిదాకా మహిళలతో పాటు పురుషుల క్రికెట్లోనూ ఇన్ని టీ20ల్లో జట్టుకు కెప్టెన్సీ వహించలేదు.

## 'వైభవ్ కోసమే నా భార్య దులీప్ ట్రోఫీ చూస్తోంది'
# చిన్నోడిపై మాజీ క్రికెటర్ ప్రశంసలు

సూర్యవంశీపై కురుస్తున్న ప్రశంసల వర్షం

తాజాగా ఈ చిచ్చరపిడుగును మెచ్చుకున్న కృష్ణమాచారి శ్రీకాంత్



ఢిల్లి : క్రికెట్ లో ఎంట్రీ ఇచ్చిన తర్వాత వైభవ్ సూర్యవంశీ ఏ టోర్నీలో ఆడినా సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నాడు. ఐపీఎల్, డొమెస్టిక్, అంతర్జాతీయ క్రికెట్‌లో 15ఏళ్లకే తన ముద్ర వేస్తూ రికార్డులు బ్రేక్ చేస్తున్నాడు. ఇప్పుడు దేశవాళీ టెస్టు ఫార్మాట్ దులీప్ ట్రోఫీలోనూ ఈ చిచ్చరపిడుగు ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమంలోనే వైభవ్ తన కెరీర్ లోనే అత్యుత్తమ ప్రశంస అందుకున్నాడు. భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించాడు. తన సతీమణి వైభవ్ కోసమే దులీప్ ట్రోఫీ చూస్తున్నారని అన్నాడు. ఇప్పుడిప్పుడే కెరీర్ ప్రారంభించిన అతడికి ఇలాంటి ప్రశంస దక్కడం తన ప్రతిభకు నిదర్శనం అని చెప్పవచ్చు.

### వైభవ్ కోసమే నా భార్య దులీప్ ట్రోఫీ చూస్తోంది : క్రిష్

"వైభవ్ అద్భుతంగా ఆడుతున్నాడు. అందుకే అతడిని నిరుత్సాహపరచకూడదు. ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉండాలి. సరైన రీతిలో తీర్చిదిద్దితే, అతడు భవిష్యత్తులో ఒక సూపర్ స్టార్ అవుతాడు. టెస్ట్ క్రికెట్‌కు పూర్వ వైభవాన్ని అతను తిరిగి తెస్తాడు. అతని వల్లే అందరూ దులీప్ ట్రోఫీని చూశారు. చివరికి నా భార్య కూడా అతని కోసమే ఈ మ్యాచ్ లు చూస్తోంది. భవిష్యత్తులో ప్రపంచ క్రికెట్‌కు అతను ఒక గొప్ప ఆటగాడిగానిలుస్తాడు" అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

### ప్రపంచ క్రికెట్ ను ఏలేస్తాడు

'ఈ కుర్రాడు ఉన్నత స్థాయి క్రికెట్ ఆడగలడా? లేదా అని ఎవరైనా ఇంకా ఎలా సందేహించగలరు? అతను ఏ స్థాయి క్రికెట్ అయినా ఆడగలడు. త్వరలోనే అన్ని ఫార్మాట్లలోనూ ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడు. ఏమాత్రం భయం లేకుండా రెడ్ బాల్ క్రికెట్‌లో మీడియం పేసర్లను ఎదుర్కొంటున్నాడు. వాళ్ల బౌలింగ్ లో స్ట్రెయిట్ సిక్సర్లు కొడుతూ విరుచుకుపడుతున్నాడు' అని క్రిష్ అన్నాడు. కాగా, ఈ టోర్నీలో వైభవ్ ఈస్ట్ జోన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆ జట్టుకు అతడు వైస్ కెప్టెన్ కూడా. రీసెంట్ గా నార్త్ జోన్ తో జరిగిన మ్యాచ్‌లో విఫలమైనా (8 పరుగులు), సెమీ ఫైనల్ లో ఆకట్టుకున్నాడు. సెంట్రల్ జోన్ తో జరిగిన ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్ లో 92 పరుగులు, రెండో ఇన్నింగ్స్ లో 40 రన్స్ తో చేసి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. ఇక ఈ టోర్నీలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ టైటిల్ ఫైట్ లో ఈస్ట్ జోన్ తో సౌత్ జోన్ జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 06న ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది.

### 15ఏళ్లకే కెప్టెన్ గానూ

అయితే 15ఏళ్లకే ఇంటర్నేషనల్ డెబ్యూ చేసిన వైభవ్, అదే వయసులోనే దులీప్ ట్రోఫీ జట్టుకు కెప్టెన్ గానూ బాధ్యతలు వహించాడు. ప్రస్తుత టోర్నీ సెమీస్ లో సెంట్రల్ జోన్ తో మ్యాచ్ సమయంలో తమ జట్టు రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కు గాయమైంది. దీంతో అతడు కాసేపు మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఈస్ట్ జోన్ కు వైభవే కెప్టెన్ గా వ్యవహరించాడు.

## భారత క్రికెట్ చరిత్రలోనే మొట్టమొదటిసారి
# జపాన్ తో టీమ్ఇండియా మ్యాచ్ కు డేట్ ఫిక్స్

ఆసియా క్రీడల కోసం ఈ నెలలోనే జపాన్‌కు వెళ్లనున్న భారత పురుషుల క్రికెట్ జట్టు - అంతకుముందు జపాన్‌తో ఒక చరిత్రాత్మక మ్యాచ్



: భారత్ క్రికెట్ లో అపూర్వ ఘట్టం ఆవిష్కృతం కానుంది. క్రికెట్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా టీమ్ఇండియా జట్టు జపాన్ తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనుంది. భారత్– జపాన్ మధ్య 75ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా పురుషుల జట్ల మధ్య ఈ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు బీసీసీఐతోపాటు జపాన్ క్రికెట్ అసోసియేషన్ అధికారికంగా వెల్లడించాయి. దీంతో ఈ మ్యాచ్ ఇరుదేశాల క్రికెట్ లో చరిత్రాత్మక ఘట్టంగా నిలువనుంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ మ్యాచ్‌ను భారత క్రికెట్‌కు ఒక గొప్ప అవకాశంగా అభివర్ణించారు. జపాన్ ప్రేక్షకుల ప్రేమను అందుకునేందుకు ఈ మ్యాచ్ మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. భారత్ – జపాన్ మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహపూర్వక సంబంధాలను ప్రస్తావించిన సైకియా, దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ భాగస్వామ్యం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉందని అన్నారు. క్రికెట్‌ను హద్దులు దాటి విస్తరించాల్సిన బాధ్యత తమపై ఉందని బీసీసీఐ గుర్తిస్తోందని, క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తామని కూడా సైకియా తెలిపారు. ఈ మ్యాచ్ పట్ల జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జజూా) నవోకి మియాజీ హర్షం వ్యక్తం చేశారు. భారత జట్టును జపాన్‌కు ఆహ్వానించడం తమ బోర్డుకు ఒక చరిత్రాత్మక ఘట్టమని నవోకి మియాజీ పేర్కొన్నారు. ఇందుకోసం సహకారం అందించిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలియజేశారు. భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, స్థానిక జపనీస్ ప్రజలు మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం జపనీస్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో తమ సామర్థ్యాన్ని పరీక్షించుకునే గొప్ప అవకాశంగా నిలుస్తుంది. కాగా, 'సుజుకి కప్' పేరుతో ఈ మ్యాచ్ ను నిర్వహించనున్నారు. ఇది 2026 సెప్టెంబర్ 22న తోచిగి ప్రాంతంలోని 'సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్'లో జరుగునుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. తమ దేశంలో క్రికెట్ అభివృద్ధి, ప్రజాదరణ కోసం జపాన్ క్రికెట్ అసోసియేషన్ చాలా కాలంగా కృషి చేస్తోంది. ఈ తరుణంలో, భారత జట్టుతో జరగనున్న ఈ మ్యాచ్ స్థానిక క్రీడాకారులు, క్రికెట్ అభిమానులకు గొప్ప ఆకర్షణగా నిలవనుంది. చరిత్రాత్మక మ్యాచ్ లో వైభవ్ ! అయితే భారత పురుషుల క్రికెట్ జట్టు ఆసియా క్రీడల కోసం ఈ నెలలోనే జపాన్‌కు వెళ్లనుంది. 24న క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. అయితే, అంతకంటే రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ జరగనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే అడుగుపెడుతున్న జపాన్ మధ్య ఈ పోరు ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే దాదాపు ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన జట్టుతోనే టీమ్ఇండియా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ఒకవేళ అదే జరిగితే ఇందులో మన చిచ్చరపిడుగు 15ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆడే అవకాశం ఉంటుంది. కెరీర్ ప్రారంభించిన కొద్దిరోజులకే అతడికి ఇలాంటి చరిత్రాత్మక మ్యాచ్ లో ఆడే అవకాశం దక్కితే అతడి ఖాతాలో అరుదైన రికార్డు పడినట్లే! స్పోర్ట్స్ 75 భారత్ ప్రధాని నరేంద్రమోదీ – జపాన్ పీఎం సనా యె తకాయిచి మధ్య చర్చలు సఫలం అయినందున 'స్పోర్ట్స్ 75' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జరగనున్న తొలి కార్యక్రమం ఈ టీ20 మ్యాచ్. క్రీడల ద్వారా రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను, సహకారాన్ని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశం. అలాగే, 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే భారత ఆశయానికి జపాన్ సహకారం కూడా తోడ్పడనుంది.

# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు ఖరారు- పూర్తి షెడ్యూల్ ఇదే

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్

ఈ లీగ్‌లో తలపడనున్న మొత్తం నాలుగు జట్లు




ఢిల్లి : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) షెడ్యూల్ ఖరారైంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. సెప్టెంబర్ 19 నుంచి సెప్టెంబర్ 27 వరకు ఈ మ్యాచ్‌లు అట్టహాసంగా సాగనున్నాయి. ఈ లీగ్‌లో మొత్తం నాలుగు మేటి జట్లు తలపడనుండగా, ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరిగేలా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టోర్నమెంట్ ప్రారంభ వేడుక సెప్టెంబర్ 19న ఘనంగా జరగనుంది. మధ్యాహ్నం 1:30 గంటలకు రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీ లాంఛనంగా మొదలవుతుంది. అదే రోజు సాయంత్రం 6:00 గంటలకు 'అమరావతి ఈ ఛాంపియన్స్', వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు తలపడనున్నాయి. రాత్రి వేళల్లో జరిగే మ్యాచ్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ లీగ్ దశలో ప్రతి జట్టూ మిగతా జట్లతో నిర్ణీత మ్యాచ్‌లు ఆడుతుంది. లీగ్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో అత్యధిక మార్కులతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన పటిష్టమైన జట్లు సెప్టెంబర్ 27న జరగనున్న తుది పోరు (ఫైనల్)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఒకవేళ ఫైనల్ మ్యాచ్ జరిగే రోజు వర్షం లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ఆటకి అంతరాయం ఏర్పడితే, మ్యాచ్ నిర్వహణ కోసం సెప్టెంబర్ 28ని ప్రత్యేక రిజర్వ్ డేగా నిర్వాహకులు కేటాయించారు.

### 'అమరావతి ఈ ఛాంపియన్స్' మ్యాచ్‌ల షెడ్యూల్

సెప్టెంబర్ 19: వైజాగ్ ఫైర్ బర్డ్స్ జం అమరావతి ఈ ఛాంపియన్స్ తలపడుతుంది. సెప్టెంబర్ 20: రాయలసీమ జెన్ స్టార్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ పోటీ పడుతుంది. సెప్టెంబర్ 21: గోదావరి గోల్డెన్ ఈగల్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ మ్యాచ్ ఉంటుంది. సెప్టెంబర్ 23: వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో అమరావతి జట్టు రెండోసారి అమీతుమీ తేల్చుకుంటుంది. సెప్టెంబర్ 24: గోదావరి గోల్డెన్ ఈగల్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ తదుపరి మ్యాచ్ ఆడుతుంది. సెప్టెంబర్ 25: లీగ్ దశలో చివరి మ్యాచ్‌గా రాయలసీమ జెన్ స్టార్స్‌తో అమరావతి జట్టు తలపడుతుంది.

### టీంలు- ఫ్రాంచైజీలు

పురుషుల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా మహిళల లీగ్‌ను నిర్వహించేందుకు ఏసీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఈ టోర్నీలో పాల్గొనే నాలుగు జట్ల కోసం విజయవాడలో జరిగిన ప్లేయర్ల వేలం ఆసక్తికరంగా సాగింది. వేలం ముగిసే సమయానికి మొత్తం 74 మంది మహిళా క్రికెటర్లు వివిధ ఫ్రాంచైజీలకు ఎంపికయ్యారు. డబ్ల్యూఏపీఎల్‌లో నాలుగు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఫ్రాంచైజీలుగా అమరావతి ఈ–ఛాంపియన్స్‌కు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, వైజాగ్ ఫైర్ బర్డ్స్‌కు ఒరా మోటార్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌కు ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్, రాయలసీమ జెన్ స్టార్స్‌కు గ్యారిసన్ కన్‌స్ట్రక్షన్స్‌లు హక్కులను దక్కించుకున్నాయి.

### అమరావతి ఈ-ఛాంపియన్స్ జట్టు

రామోజీ గ్రూప్ కు చెందిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతి ఈ–ఛాంపియన్స్ జట్టును సొంతం చేసుకుంది. నీరగట్టు అనూష (బ్యాటర్), కాంద్రేగుల దేవిక(ఆల్‌రౌండర్), కాట్రగడ్డ దీక్ష(వికెట్ కీపర్), షబ్నమ్ షకీల్(ఆల్‌రౌండర్), పి.రంగలక్ష్మి (బ్యాటర్), తరుణి జోషిని (ఆల్‌రౌండర్), కట్టా మహంతి(బ్యాటర్ ), కె.హంస (ఆల్‌రౌండర్), అంకం విష్ణుప్రియ (బ్యాటర్), హేమసాయి రమ్య (బ్యాటర్), సాయిపూజిత (ఆల్‌రౌండర్), నక్కా సనా (బౌలర్), ఓరుగంటి సాహితీశ్రీ (ఆల్‌రౌండర్), ఎం.రుక్సార్ తబస్సుమ్, సాయిదీప్తి, బొడ్డుపల్లి తనిష్క, టి.మల్లిక, ఎం.సహస్రరెడ్డి

# రోహిత్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. అతని స్థానానికి ఢోకా లేదన్న బీసీసీఐ

భారత సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలను బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా కొట్టిపారేశారు.




ఢిలి : భారత సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలను బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా కొట్టిపారేశారు. వన్డే జట్టులో ప్రస్తుతం అతని స్థానానికి ఢోకా లేదని స్పష్టం చేశారు. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో బోర్డు మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌లో రోహిత్ శర్మ క్రికెట్ భవితవ్యంపై బోర్డు కీలక నిర్ణయం తీసుకుంటుందని వార్తలు వచ్చాయి. మీటింగ్ తర్వాత సైకియా మీడియాతో మాట్లాడుతూ.. రోహిత్ రిటైర్మెంట్ వార్తలను తోసిపుచ్చారు. రోహిత్ బాగా ఆడుతున్నాడని, వదంతులకు ఆజ్యం పోయద్దన్నారు. 'అన్ని మ్యాచ్‌ల్లోనూ రోహిత్ బాగా ఆడుతున్నాడు. ఇంకేం కావాలి?. తన చివరి మ్యాచ్‌లో అతను 130–140 స్కోరు చేశాడు. అయినా ఈ ఊహాగానాలు ఎందుకు?. ఊహాగానాలు చేసే వారికి నేను ఆజ్యం పోయాలనుకోవడం లేదు.'అని సైకియా తెలిపారు. అలాగే, ఇటీవల భారత ఆటగాళ్లు తరుచుగా గాయపడటం కూడా చర్చనీయాంశమైంది. దీనిపై సైకియా స్పందిస్తూ.. చాలా మ్యాచ్‌లు ఆడటం వల్ల ప్లేయర్లు గాయపడుతున్నారని చెప్పారు. 'ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన 15 మందిలో ముగ్గురు లేదా నలుగురు ప్లేయర్లు గాయపడ్డారు. ఆ టూరుకు ముందు వారు రెండు నెలలు ఐపీఎల్ ఆడిన విషయాన్ని మర్చిపోవద్దు. కాబట్టి, వారి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. అలాంటి పరిస్థితులను నివారించడానికి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నాం. గాయం తర్వాత ఒక ప్లేయర్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎలా తిరిగి రావాలనే దానిపై మా వద్ద ప్రొటోకాల్ ఉంది. సరైన వ్యూహాలను రూపొందించడానికి కెప్టెన్లు, హెడ్ కోచ్ నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటాం. వచ్చే ఫ్యూచర్ టూర్ ప్రొగ్రాంలో సేనా దేశాలలో జరిగే ప్రధాన సిరీస్‌లకు ముందు ఆటగాళ్లకు సరైన విశ్రాంతనిస్తాం.,అక్కడి వాతావరణానికి అలవాటు పడటానికి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తాం.'అని సైకియా చెప్పారు. ఈ సమావేశంలో ఇటీవల ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలో భారత జట్టు ప్రదర్శనను సమీక్షించారు. అలాగే, పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్, సెక్రెటరీ సైకియా, వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. అయితే, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకాకపోవడం గమనార్హం.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815